- వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు..
- అమలు చేస్తామని గద్దెనెక్కిన రేవంత్
- గడువు దాటినా అమలు కాని హామీలెన్నో
- ఉచిత బస్సు మినహా మిగతా వాటి ఊసే లేదు
- రుణమాఫీ కాలే.. రైతుభరోసా రాలే..
- మహిళలందరికీ పింఛన్లు అందలే..
- సామాజిక పెన్షన్ల పెంపు అమలు కాలే..
- వంద రోజుల పాలనపై ప్రజల పెదవి విరుపు

నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, గురువారం 28 మార్చి 2024 | NIZAMABAD


## వీగిన అవిశ్వాస తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీవో శ్రీనివాస్

ధర్పల్లి, మార్చి 27 : మండలంలోని ప్రాజెక్టు రామడుగు సొసైటీ చైర్మన్ ధర్మయ్యగారి రాజేందర్ రెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఈనెల 4న సొసైటీకి చెందిన ఏడుగురు డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ డీసీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన సొసైటీ పాలకవర్గ సభ్యులందరికీ ఈనెల 11న నోటీసులు ఇవ్వగా.. దాని ప్రకారం బుధవారం రామడుగు గ్రామంలోని సొసైటీ కార్యాలయంలో పోలీసు బందోబస్తు మధ్య అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభమైనప్పటికీ ఒక్క డైరెక్టర్ కూడా హాజరుకాకపోవడంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు డీసీవో ప్రకటించారు. ప్రస్తుత చైర్మన్ రాజేందర్‌రెడ్డి పాలన కార్యక్రమాలు కొనసాగించుకోవచ్చని డీసీవో స్పష్టం చేశారు. సమావేశంలో రామడుగు సొసైటీ కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, ధర్పల్లి సొసైటీ కార్యదర్శి సంతోష్‌రెడ్డి, గంగనర్సయ్య, సీఐ భిక్షపతి, ఎస్సై విక్రమ్ పాల్గొన్నారు.

# మాట తప్పిన కాంగ్రెస్




## ఇది 'గ్యారంటీ'గా వంచనే..

నిజామాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

కాంగ్రెస్ పార్టీ మాట తప్పింది. ఊరించి ఉసూరుమనిపించింది. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని గద్దెనెక్కిన రేవంత్ సర్కారు.. వాటి అమలులో విఫలమైంది. మహిళలకు ఫ్రీ బస్ మినహా మిగతా వాటి విషయంలో పూర్తిగా వైఫల్యం చెందింది. అసెంబ్లీ ఎన్నికల వేళ రైతుభరోసా, చేయూత, యువ వికాసం, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు పేరిట ఆరు గ్యారంటీలను ప్రకటించిన కాంగ్రెస్.. వాటిలో అంతర్భాగంగా అనేక హామీలను చేర్చింది. రూ.2 లక్షల పంట రుణమాఫీ, కౌలు రైతులకు ఆర్థిక సాయం, ప్రతి మహిళకూ నెలకు రూ.2,500 చొప్పున పింఛన్లు, సామాజిక పింఛన్ల పెంపు తదితర వరాలెన్నో కురిపించింది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వాటన్నింటినీ అమలు చేస్తామని చెప్పిన హస్తం పార్టీ.. ఆచరణలో విఫలమైంది.

### తేదీతో సహా చెప్పి..

డిసెంబర్ 7వ తేదీన రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఆ రోజు సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అనేక హామీలు ఇచ్చిన పీసీసీ చీఫ్.. అమలు చేసే తేదీలతో సహా ప్రకటించారు. డిసెంబర్ 9వ తేదీన ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, ఆ రోజే రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామని అనేక బహిరంగ సభల్లో స్పష్టంగా చెప్పారు. అంతేకాదు రైతులు బ్యాంకులకు రుణాలు చెల్లించొద్దని రెచ్చగొట్టే ప్రకటనలు చేశారు. రుణాలు చెల్లించిన వారు సైతం తిరిగి కొత్త లోన్లు తెచ్చుకోవాలని, పంట రుణాలు తీసుకోని వారు సైతం తీసుకోవాలని సూచించారు. రూ.లక్ష లోపు పంట రుణం ఉన్న వారు సైతం రూ.2 లక్షలు తీసుకోవాలని, తాము అధికారంలోకి రాగానే మాఫీ చేస్తామని ప్రకటించారు. అయితే, డిసెంబర్ 9వ తేదీన రుణాలు మాఫీ చేస్తామని తేదీతో సహా చెప్పిన రేవంత్‌రెడ్డి.. అమలు చేయడంలో విఫలమయ్యారు. మార్చి నెలాఖరు వస్తున్నా రుణమాఫీ ఊసే ఎత్తడం లేదు.

### ఫ్రీ సరే.. బస్సులేవి..?




కాంగ్రెస్ సర్కారు తెచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం మాత్రం విజయవంతమైంది. మహిళల నుంచి మంచి స్పందన లభించింది. అయితే, రద్దీ పెరిగిన నేపథ్యంలో అందుకు తగిన విధంగా బస్సులను నడపడంలో ఆర్టీసీ విఫలమవుతున్నది. పెరిగిన ఆక్యుపెన్సీ ప్రకారం బస్సులు నడపలేక అధికారులు చేతులెత్తేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మండలాలకు, జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రయాణికులు గంటల తరబడి రోడ్లపైనే పడిగాపులు కాస్తున్నారు. డిమాండ్‌కు తగినట్లుగా బస్సులు లేక మహిళలు ప్రమాదకర రీతిలో ఫుట్‌బోర్డుపై నిల్చుని ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. బస్సుల కోసం సాలూర మండల కేంద్రంలో కాలేజీ విద్యార్థులు ఇటీవల ధర్నాకు దిగడం గమనార్హం.

### యువతకు కుచ్చుటోపి..



యువ వికాసం పేరిట విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలానికో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. అధికారం చేపట్టి వంద రోజులు దాటినా ఆ దిశగా చేపట్టిన చర్యలు శూన్యం. ఇక, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతను రెచ్చగొట్టి టీఎస్‌పీఎస్సీ పరీక్షలు నిర్వహించకుండా అడుగడుగునా అడ్డంకులు సృష్టించిన కొన్ని శక్తులు ఇప్పుడు కనుమరుగయ్యాయి. కేసీఆర్ సర్కారుకు చెడ్డ పేరు తెచ్చేందుకు గతంలో చీటికి మాటికి కోర్టు మెట్లు ఎక్కి నోటిఫికేషన్లు, పరీక్ష తేదీల రద్దు కోరుతూ కల్పిత ఆందోళనలతో ఇబ్బందులు సృష్టించిన వారంతా.. కాంగ్రెస్ అధికారంలోకి తెరమరుగయ్యారు. 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. అయితే, కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన ఉద్యోగ పరీక్షల ఫలితాలను ప్రకటించి, అభ్యర్థులకు నియామక పత్రాలు అందించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని తమ ఖాతాలో వేసుకుంటున్నది. నర్సింగ్ ఆఫీసర్లు, పోలీస్ కానిస్టేబుళ్లు, గురుకుల నియామకాల్లో భర్తీ చేసిన 28 వేల ఉద్యోగాలను తమ గొప్పదనంగా చెప్పుకుంటున్నది.

### మహాలక్ష్మి.. మరో దగా!



మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు అర్హులైన మహిళలందరికీ రూ.2500 చొప్పున ఆర్థిక సాయం చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ నెలకు రూ.2500 చెల్లిస్తామని ఊదరగొట్టారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆర్థిక సాయం అందించడంలో అడుగు ముందుకు వేయలేదు. అధికారంలోకి వంద రోజులు దాటింది కదా.. పింఛన్ల సంగతేమిటని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఇక సామాజిక పింఛన్లను పెంచుతామన్న రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోలేదు. ప్రస్తుతం ఇస్తున్న రూ.2 వేల పెన్షన్లను అధికారంలోకి రాగానే రూ.4 వేలు చేస్తామన్నారు. కానీ అమలు చేయలేక చేతులెత్తేశారు. ఇక ఇటీవల ప్రారంభించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంలో అనేక లోపాలు వెలుగులోకి వస్తున్నాయి. సగం మందికి కూడా జీరో బిల్లులు రాలేదు. దీంతో వారంతా మండలాఫీసుల వద్దకు పరుగులు పెడుతున్నారు. ఎన్నికల హామీల్లో ఒకటైన రూ.500లకే వంటగ్యాస్ పథకం ప్రారంభించినట్లు ప్రభుత్వం ప్రకటించినా ఉమ్మడి జిల్లాలో అమలులోకి వచ్చిన దాఖలాల్లేవు.

### 'భరోసా' ఏది?



ఎన్నికల ముంగిట రైతు భరోసా పేరిట అన్నదాతలపై వరాలు కురిపించిన హస్తం పార్టీ అమలులో రిక్త'హస్తం' చూపింది. రైతుబంధు సాయం రూ.15 వేలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. గతంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రూ.10వేల పెట్టుబడి సాయాన్ని అందించడంలోనూ విఫలమైంది. యాసంగిలో ఇవ్వాల్సిన రైతుబంధు.. ఇప్పటికీ వేలాది మంది రైతులకు అందలేదు. మూడెకరాల లోపు ఉన్న వారికి మాత్రమే ఆర్థిక సాయం అందించి కాంగ్రెస్ సర్కారు చేతులు దులుపుకొన్నది. మిగతా వారికి ఎప్పుడిస్తారనే స్పష్టత కూడా లేదు. మరోవైపు, రైతుబంధు పథకంలో అనేక కొర్రీలు పెట్టడం ద్వారా లబ్ధిదారుల సంఖ్యను సగానికి సగం కుదించేందుకు సర్కారు సన్నాహాలు చేపట్టింది. కౌలు రైతులకు సైతం రూ.12 వేలు ఇస్తామన్న కాంగ్రెస్.. ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు రూ.500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీ బోగస్‌గానే మారింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి కోతలు ఊపందుకుంటున్నాయి. మరికొద్ది రోజుల్లో మిగతా చోట్ల ప్రారంభం కానున్నాయి. అయినప్పటికీ బోనస్ విషయంలో సర్కారు నుంచి స్పందన కరువైంది.

## ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

### కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ



మాట్లాడుతున్న ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి,మార్చి 27 : పార్లమెంట్ ఎన్నికలను పోలీసు అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఎస్పీ సింధూశర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు అధికారులతో బుధవారం నెలవారీ సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల సంఘం సూచనల ప్రకారం బాధ్యతగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానిత వ్యక్తులు, రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో భరోసా కల్పించేలా పని చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగులు, జూదం, మట్కా తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దొంగతనం కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకొని సొత్తును రికవరీ చేసి బాధితులకు త్వరగా అందేలా చూడాలని అన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విధుల్లో ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ జార్జ్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మురళి, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

## గొడుగు నీడన బతుకు బండి




పొట్టకూటి కోసం శ్రమజీవులు పడే బాధలు వర్ణణాతీతం. ఎండనక, వాననక ఎన్ని ఇబ్బందులెదురైనా ఎదుర్కొంటూ బతుకుబండిని ముందుకు నడిపించాల్సిందే. ఆర్మూర్ పట్టణంలోని ఎంజీ రోడ్డు పక్కన వివిధ గ్రామాల నుంచి వచ్చిన చిరువ్యాపారులు కూరగాయలు, పండ్లు విక్రయిస్తూ బతుకీడుస్తున్నారు. వేసవికాలం కావడంతో మండే ఎండలో గొడుగు కింద కూర్చొని కూరగాయలు, పండ్లు విక్రయిస్తున్నారు.
–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్




కామారెడ్డిలో 5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్




నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పరుగును ప్రారంభిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్




ఉమ్మడి జిల్లాలో విజయవంతం
పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు, యువత, విద్యార్థులు

# ఉత్సాహంగా 5 కే రన్

కామారెడ్డి, మార్చి 27 : ఓటుహక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో బుధవారం ఉదయం 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' అనే నినాదంతో నిర్వహించిన 5కే రన్ ఉత్సాహంగా సాగింది. కామారెడ్డిలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, నిజామాబాద్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కామారెడ్డిలో కలెక్టర్ మాట్లాడుతూ..అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటు వజ్రాయుధం వంటిదని ఎలాంటి ప్రలోభాలకు లోను కావద్దన్నారు. ఏప్రిల్ 1 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని,పోలింగ్ శాతాన్ని పెంచడానికి తోడ్పాటును అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో ఎస్పీ సింధూ శర్మ, ఆర్డీవో రఘునాథ్‌రావు, సీపీవో రాజారాం, ఎన్నికల నోడల్ అధికారి వెంకటేశ్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కార్యదర్శి సాయిలు,టీజీవో అధ్యక్షుడు దేవేందర్,ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నిజామాబాద్ జిల్లా కేంద్రంలో..

ఖలీల్‌వాడి, మార్చి 27 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 5 కే రన్‌లో వివిధ శాఖల అధికారులతోపాటు డ్వాక్రా సంఘాల సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు విద్యార్థులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, యువతీయువకులు భాగస్వాములయ్యారు. పాత కలెక్టరేట్ నుంచి చేపట్టిన 5కే రన్ ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల మీదుగా తిరిగి ఓల్డ్ కలెక్టరేట్ మైదానం వరకు కొనసాగింది. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శంకర్, స్వీప్ నోడల్ అధికారి సురేశ్‌కుమార్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ముత్తెన్న, జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్, మున్సిపల్ అధికారి రమేశ్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ

### ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, మార్చి 27: రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పెద్దలకు రాష్ట్రం నుంచి ముడుపులు పంపిస్తున్నారని, వారి చేతిలోనే రాష్ట్రం రిమోట్ ఉందని విమర్శించారు. అవినీతికి పుట్టిన కవల పిల్లలు బీజేపీ, కాంగ్రెస్ అని మండిపడ్డారు. బుధవారం ఆయన నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ 111 రోజులైనా సక్రమంగా అమలుచేయడంలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాక్షస పాలన అందిస్తున్నాయని విమర్శించారు. మోదీకి నచ్చిన వాళ్లు జేబులోకి, నచ్చని వారిని జైల్లోకి పంపించడం ఆనవాయితీగా మారిందని ఎద్దేవా చేశారు. ఈడీని మోదీ తన జేబు సంస్థగా వాడుకుంటున్నారని ఆరోపిం చారు. కవితను అరెస్టు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

### బెదిరించి పార్టీలో చేర్చుకుంటున్నారు..

కాంగ్రెస్ నాయకులు ఇతర పార్టీల వారిని బెదిరించి వారి పార్టీలో చేర్చుకుంటున్నారని జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఆర్మూర్ మున్సిపల్‌తోపాటు డీసీసీబీని కైవసం చేసుకున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ ఎవరినీ బెదిరించకుండా పాలన సాగించినట్లు ఆయన గుర్తుచేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చీప్ లిక్కర్ అమ్ముకుంటూ ప్రజల ఆరోగ్యాలను పాడుచేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాలికొదిలేసి కాళేశ్వరం సక్రమంగా నిర్మించలేదని, ఫోన్ ట్యాపింగ్ అంటూ కాలయాపన చేస్తున్నదని జీవన్‌రెడ్డి మండిపడ్డారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి